## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం 33/11 కేవీ గొల్లపల్లి ఫీడర్‌లో మరమ్మతు దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. లక్ష్మీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, ధర్మారం, జాబితాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఉండదన్నారు.

### నేడు పెగడపల్లిలో అడ్లూరి పర్యటన

పెగడపల్లి: మండలంలో శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తారని తెలిపారు. పెగడపల్లి, నందగిరి, రాజరాంపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారన్నారు.

### మొక్కజొన్న దగ్ధం

రాయికల్: వస్తాపూర్ గ్రామానికి చెందిన గడ్డం దీపక్‌రెడ్డి అనే రైతుకు చెందిన మొక్కజొన్న కంకులకు గురువారం గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లింది.

### ఇసుక టిప్పర్ పట్టివేత

కథలాపూర్: పోసానిపేట గ్రామ శివారులో గల వాగులో నుంచి అక్రమంగా ఇసుకను టిప్పర్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్, ఆర్‌ఐ నాగేశ్ గురువారం తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు కథలాపూర్ శివారులో రెవెన్యూ సిబ్బంది మకాం వేశారు. ఇసుకను తరలిస్తున్న టిప్పర్ కనిపించడంతో పట్టుకొని ఠాణాకు తీసుకెళ్లారు.

### బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంకుమార్ అన్నారు. గురువారం గుండంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండంపల్లికి చెందిన గొర్రె రాజం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. బాధిత కుటుంబానికి మంజూరైన బీమా నగదు రూ.2లక్షలను కుటుంబ సభ్యులకు అందజేశారు. మెట్‌పల్లి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు నిగ రాజేశ్, మ్యాదరి రాకేశ్, రజని, పంచాయతీ కార్యదర్శి నోముల నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ మామిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలి

మల్యాల: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనందరావు, కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. రాజారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగరావు విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంఈవో జయసింహారావు, రాజగోవిందరెడ్డి, ఏవీఎస్ రాజు, మల్లారెడ్డి, వేణుగోపాలరావు, జమీల్, మహేశ్, భూపతిరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, కోషోర్, ప్రశాంత్‌రెడ్డి, విజయ్, వెంకటరమణ, దుబ్బయ్య, సత్యయనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

### అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖ సినీ దర్శకుడు

ధర్మపురి: ధర్మపురికి చెందిన ప్రముఖ పురోహితుడు ఉమాశంకర్‌శర్మ(69) ముంబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం ఆయన స్వస్థలమైన ధర్మపురిలో అంత్యక్రియలు జరిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రముఖ సినీ దర్శకుడు హరీశ్ శంకర్ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### పాఠశాల పరిశీలన

కోరుట్ల: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విభాగాన్ని బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత సందర్శించారు. కెడెట్లతో మాట్లాడారు. రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. క్లాసుల నిర్వహణ విధానాన్ని తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్, ప్రిన్సిపాళ్లు రాధాకృష్ణ, వినోద, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులకు ఆకలి పరీక్షలు

పెగడపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం కేంద్రాల్లోని చిన్నారులకు ఆకలి పరీక్షలు నిర్వహించారు. సమావేశాలు ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కథలాపూర్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ హైమాది బేగం సూచించారు. గురువారం గంభీర్‌పూర్, భూషణరావుపేట గ్రామాల్లో పోషణ పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి సురేంద్రకుమార్, అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, శారద, మల్లీశ్వరి, రాజ్యలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.



### కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ రాకుండా ఏర్పాట్లు

సారంగాపూర్: ఎండ తీవ్రత దృష్ట్యా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వడదెబ్బ సోకకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సారంగాపూర్ సింగిల్‌విండో పరిధిలో 10 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈనెల 19న ప్రారంభిస్తుండగా.. కలెక్టర్ ఆదేశాలతో రైతులకు నీడతోపాటు చల్లని నీటిని అందించడానికి రంజన్లను అందుబాటులో ఉంచుతున్నారు. విండో పరిధిలో నాయికపుగూడెం, బట్టపల్లి, పోతారం, భీంరెడ్డిగూడెం, మ్యాదారంతండా, రంగపేట, ఒడ్డెరకాలని, నాగునూర్, లచ్చక్కపేట, ధర్మనాయక్‌తండా గ్రామాల్లో ఈనెల 19న ప్రారంభించనున్నారు.



### వాసవి మాత వార్షిక వేడుకలు

రాయికల్: పట్టణంలోని వాసవి మాత ఆలయంలో గురువారం వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎలగందుల సత్యనారాయణ, నాయకులు గంప ఆనందం, పిప్పరి జగన్ పాల్గొన్నారు.



### మహిళా దొంగల ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు

జగిత్యాలక్రైం: దొంగతనాలను నివారించేందుకు పట్టణ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. కొద్దికాలంగా జిల్లాలో అంతర్ రాష్ట్ర మహిళా దొంగల ముఠా చోరీలు చేస్తున్న నేపథ్యంలో చోరీలను అరికట్టేందుకు బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జగిత్యాల కొత్త బస్టాండ్, పాత బస్టాండ్‌తోపాటు పలు ప్రధాన చౌరస్తాల్లో అంతర్ రాష్ట్ర మహిళా దొంగల ఫొటోలతో ముద్రించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు వీరిని గుర్తుపట్టి పోలీసులకు సమాచారమందించాలని కోరుతున్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్యాల: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని, దళారుల బారి నుంచి రైతులను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాలకు రూ.500 బోనస్ అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాల, రామన్నపేట, ముత్యంపేట, నూకపల్లి, రామన్నపేట గ్రామాల్లో ఐకేపీ, పాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరిశ్రీనివాస్‌గౌడ్, దారం ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, ముత్యాల రాంలింగారెడ్డి, శనిగరపు తిరుపతి, వీరబత్తిని ప్రతాప్, ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీందర్, ఆర్‌ఐ తిరుపతి, ఐకేపీ ఏపీఎం రాజయ్య, నాయకులు హరినాథ్, నర్సింహారెడ్డి, లక్ష్మణాచారి, సతీశ్‌రెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నక్క అనిల్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: రైతులు ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని డీఆర్డీవో పీడీ రఘువరణ్ అన్నారు. అనంతారం, పొలాస గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, సివిల్ సప్లయ్ అధికారులు వరప్రసాద్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మేడిపల్లి: వల్లంపల్లి, దమ్మన్నపేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీవో పీడీ రఘువరణ్ తనిఖీ చేశారు. ఓఆర్‌ఎస్ పాకెట్లు అందజేశారు. అధికారులు అశోక్, రాజు, రాణి తదితరులున్నారు. కొండాపూర్, విలయతబాద్, కట్లకుంట, వల్లంపల్లి గ్రామాల్లో ప్యాక్స్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ స్థానిక ప్యాక్స్ చైర్మన్ రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి, చేపూరి నాగరాజు, వెల్మా సమతనవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: తక్కళ్లపెల్లి, గంభీర్‌పూర్, అంబారిపేట, బొమ్మెన, తాండ్యాల, పోతారం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. ఏపీఎం నరహరి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష, డైరెక్టర్లు విజయ్, గంగాధర్, నాయకులు ఎండీ అజీమ్, కాయితి నాగరాజు, లింగంగౌడ్ పాల్గొన్నారు.

సారంగాపూర్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లను సాఫీగా నిర్వహించాలని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, బీర్‌పూర్ తహసీల్దార్ ముంతాజొద్దీన్ అన్నారు. గురువారం బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని బీర్‌పూర్, మోతీనగర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సంఘ సీఈవో అయ్యోరి తిరుపతి, ఆర్‌ఐ రాహుల్, పాలకవర్గ సభ్యులు చిగురు రాములు, వంగపల్లి కృష్ణారావు, నరిమెట్ల సతీశ్, సంఘ సిబ్బంది, రైతులున్నారు.

ధర్మపురి: వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ అన్నారు. ప్రభుత్వ విప్ సూచనల మేరకు దమ్మన్నపేట, రాజారం, పెద్ద నక్కలపేట గ్రామాల్లో పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేశ్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించిన వరి కొనుగోలు కేంద్రాలను చైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. సహకార సంఘం డైరెక్టర్లు తిరుపతి, గంగమల్లయ్య, ఏఎంసీ డైరెక్టర్లు మధూకర్‌రెడ్డి, గునిశెట్టి అంజయ్య, ఒజ్జల లక్ష్మణ్, అసెట్టి శ్రీనివాస్ తదితరులున్నారు.

### అభివృద్ధి, సంక్షేమం వివరించాలి

మల్లాపూర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలలుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. గురువారం సంగెం–శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి, పాతదాంరాజుపల్లి, వాల్గొండ, తండా గ్రామాల్లో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ నినాదంతో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు గజ్జి గంగారెడ్డి, ఎండీ జమాల్, నల్ల బాపురెడ్డి, ఉత్కం హన్మాంతుగౌడ్, నాయకులు సిరిపురం రవీందర్, ఎల్కా కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తదాంరాజుపల్లిలో మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల రూరల్: మోహన్‌రావుపేట గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జైబాపు, జైభీం, జైసంవిధాన్ నిర్వహించారు. గ్రామంలో ప్రతిజ్ఞ చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మండల అధ్యక్షుడు కొంతం రాజం, ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో

కోరుట్ల రూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదని జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్ అన్నారు. మోహన్‌రావుపేట గ్రామాన్ని గురువారం సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులు, పారిశుధ్య పనులను పరిశీలించారు. కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. మొక్కల సంరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శి సరిత తదితరులు పాల్గొన్నారు.

### సఖీ సేవలపై అవగాహన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుగ్గారం: మహిళలకు సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అందుతున్న వివిధ రకాల సేవలపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. బీర్సాని, సిరికొండ, మద్దునూర్ గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న చోటుకు వెళ్లి మహిళలకు వివరించారు. గౌతమి మాట్లాడుతూ.. సఖీ కేంద్రం నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉంటారని, పూర్తి ఉచితంగా పోలీస్ లీగల్ సపోర్టు కేంద్రం నుంచి అవసరమైన సేవలను పొందొచ్చన్నారు. పారామెడికల్ అనురాధ, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

### రైతుల సంక్షేమమే ధ్యేయం



రాయికల్‌లో ర్యాలీ

రాయికల్: రైతుల సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయమని సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అన్నారు. గురువారం రాయికల్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. జిల్లా సహకార అధికారి మనోజ్, ఆడిట్ అధికారి సత్యనారాయణ, నోడల్ అధికారి సాయికుమార్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు కుర్మ రాము, కైరం రమణ, కోంద్ర నారాయణ, బోడ భూమరాజం, ఇన్‌చార్జి సీఈవో కట్కం జగదీశ్ పాల్గొన్నారు.

### నల్ల బ్యాడ్జీలతో నిరసన



నినాదాలు చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వైఖరిని వ్యతిరేకిస్తూ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద గురువారం నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అల్లూరి మహేందర్‌రెడ్డి, జెట్టి లింగం, ఎర్రోల హన్మాండ్లు, యామ రాజయ్య, రైసుద్దీన్, బర్ల వంశీ తదితరులున్నారు.

### సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలి

ధర్మపురి: ప్రభుత్వ ఆస్పత్రికి ప్రసవాల కోసం వచ్చేవారికి ఆపరేషన్లు కాకుండా సాధారణ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మాతా శిశు సంరక్షణాధికారి ముస్కు జైపాల్‌రెడ్డి ఆదేశించారు. ధర్మపురిలోని ఏరియా ఆస్పత్రిని గురువారం సందర్శించారు. ఆస్పత్రి వైద్యులైన గైనకాలాజిస్టు మత్తు వైద్య నిపుణులు, డాక్టర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, డీసీహెచ్ డాక్టర్ రామకృష్ణ, హెచ్‌ఈవో రాజేశం తదితరులున్నారు.

### నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

సారంగాపూర్: రేచపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో స్వయంభూగా వెలసిన శ్రీగండి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. జగిత్యాల నుంచి రేచపల్లి గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డును ఆనుకొని అటవీ ప్రాంతంలో శిథిలమైన ఆలయాన్ని తొలగించి గ్రామస్తులు నూతనంగా ఆలయాన్ని అందంగా నిర్మాణం చేశారు. గండి వేంకటేశ్వరస్వామితోపాటు ఆలయం వెలుపల శ్రీఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు చేశారు. 18న ఆలయ శిఖరం, శ్రీఅభయాంజనేయస్వామి వారి విగ్రహ శోభాయాత్ర, 19న ఉదయం 9 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, యాగశాల ప్రవేశం, ప్రతిష్ఠా మూర్తులకు ఫల, పుష్ప, ధ్యాన, శయ్యాధివాసం, పూర్ణాహుతి జరగనున్నాయి. 20న ఉదయం యంత్ర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కుంభసంప్రోక్షణ తదితర కార్యక్రమాలుంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### సీఎం సహాయ నిధితో పేదలకు మేలు

మెట్‌పల్లి: సీఎం సహాయ నిధి ద్వారా పేదలకు ఆర్థికంగా మేలు జరుగుతోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం సీఎం సహాయ నిధి రూ.2.19లక్షలకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఖుత్బొద్దీన్, అందె మారుతి, మొగిలి రాజేందర్, బోడ రాజు తదితరులున్నారు.

మల్లాపూర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి అన్నారు. గురువారం పాతదాంరాజుపల్లిలో బాధితురాలు చిలివేరి గంగుకు రూ.25వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఇప్పపెల్లి గణేశ్, గోపిడి నరేశ్, మొగిలి రాజేందర్, సంక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్‌లో బంధువుల ఆందోళన

మెట్‌పల్లి: అదృశ్యమైన వెంకట్రావ్‌పేటకు చెందిన రాకేశ్(18) అనే యువకుడి కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ అతడి కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. ఈనెల 10న సాయంత్రం సమయంలో రాకేశ్ ఇంట్లో నుంచి బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మరుసటి రోజు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే 14న కోరుట్ల మండలంలోని యెఖీన్‌పూర్ వద్ద ఎస్సారెస్పీ కాలువలో రాకేశ్ బైక్ లభ్యమైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అతడి ఆచూకీని కనుగొనడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కుటుంబ సభ్యులు, బంధువులు స్టేషన్‌కు తరలివచ్చి ఆందోళన చేశారు. సీఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తమకు సహకరించాలని నచ్చజెప్పడంతో వారు శాంతించారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన ముత్తయ్య(60) అనే వృద్ధుడు మృతిచెందినట్లు బంధువులు, ఆసుపత్రి వర్గాలు తెలిపారు. కుస్తాపూర్ గ్రామానికి చెందిన ముత్తయ్య గురువారం మధ్యాహ్నం డయాలిసిస్ కోసం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. డయాలిసిస్ జరుగుతుండగానే మృతిచెందాడు. మృతుడి బంధువులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతిచెందినట్లు ఆందోళనకు సిద్ధమయ్యారు. ఎస్సై శ్రీకాంత్ మృతుడి బంధువులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామనడంతో ఆందోళన విరమించారు.

### బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా లింబాద్రిగౌడ్

రాయికల్: బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా ఇటిక్యాల గ్రామానికి చెందిన అనుపురం చిన్న లింబాద్రిగౌడ్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

### అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

పెగడపల్లి: ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, ఇందుకు ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీ సభ్యులు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియపై కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీవో మహేందర్, పీఆర్ ఏఈ శంషేర్‌అలీ పాల్గొన్నారు.

# ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు విస్తృతపరచాలి

మెట్‌పల్లిరూరల్: సెర్ప్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతపరచాలని డీఆర్డీవో పీడీ రఘువరన్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సీఆర్‌పీఈపీల ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై పలు విషయాలపై సలహాలు, సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల మండలాలను బ్లాక్‌గా ఏర్పాటు చేశామన్న ఆయన.. మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లను విస్తృతపరచడం, వాటి అభివృద్ధికి ఆర్థిక సహాయంతోపాటు సాంకేతిక సహకారాన్ని సీఆర్‌పీలు అందించాల్సి ఉంటుందన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ శ్రవణ్, అడిషనల్ డీఆర్డీవో చరణ్‌దాస్, డీపీఎం వనజ, బ్లాక్ ప్రాజెక్ట్ మేనేజర్ చక్రవర్తి, ఏపీఎంలు విమోచన, శంకర్, ఏఆర్ శంకర్, సీసీలు శ్రీనివాస్, సూరయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ రఘువరన్, అధికారులు

# డంపుయార్డులో బయో మైనింగ్ పరిశీలన

కోరుట్ల: పట్టణ శివారులోని కల్లూర్ రోడ్‌లో గల డంపింగ్‌యార్డులో బయో మైనింగ్, డ్రై రిసోర్స్ సెంటర్‌ను గురువారం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ పరిశీలించారు. మైనింగ్ జరుగుతున్న విధానం తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



డంపుయార్డు పరిశీలిస్తున్న కమిషనర్

### ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి

కథలాపూర్: ఊర్లోని ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని మహిళలను ఉపాధ్యాయులు కోరారు. గురువారం చింతకుంట గ్రామంలో మహిళా సంఘాల సమావేశంలో మాట్లాడారు. హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు విశ్వనాథం, రమేశ్ పాల్గొన్నారు.



కథలాపూర్: మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మల్లాపూర్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యనందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పిన్నంశెట్టి శ్రీనివాస్ అన్నారు. మొగిలిపేట, చిట్టాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, వీడీసీ చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, మాజీ చైర్మన్ ఎండీ మహబుబ్‌ఖాన్, వైస్ చైర్మన్ బడె రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేముల శ్రీనివాస్, శ్రీహరి, భూమేశ్వర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ నిగ శ్యామల, ఉపాధ్యాయులు కృష్ణవేణి, బబ్బూరి రాజేందర్, సుమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ సేవలు వెలకట్టలేనివి

బుగ్గారం: అంబేడ్కర్ సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివని, ఈ ప్రపంచంలోని అనేక దేశాలకు ఆయన రాసిన రాజ్యాంగం దిక్సూచిగా మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంసుధాకర్‌రావు అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు మెడవేణి శ్రీధర్, ఒరుగంటి చంద్రశేఖర్, బండారి లక్ష్మణ్, గాజు భాస్కర్, లవన్, పల్లికొండ అనిల్, సంగెపు గంగారాం తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

### అన్ని విధాలా ఆదుకుంటాం

ధర్మపురి: దుబాయ్‌లో ఇటీవల హత్యకు గురైన శ్రీనివాస్ కుటుంబానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు దామెర రాంసుధాకర్ అన్నారు. దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి ఓ కంపెనీలో పని చేసుకుంటున్నాడు. ఇటీవల పాకిస్తాన్‌కు చెందిన ఓ యువకుడి చేతిలో శ్రీనివాస్ హత్యకు గురైన విషయం తెలిసిందే. గురువారం గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వీలైనంత త్వరగా స్వదేశానికి వచ్చేలా కృషి చేస్తామన్నారు. మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

### గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైంది

జగిత్యాల: గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందని, ఈ వైరస్ సూక్ష్మ జీవుల వల్ల పశువులకు వస్తుందని పశు వైద్యాధికారి వేణుగోపాల్‌రావు అన్నారు. గురువారం కల్లెడ, పొలాస గ్రామాల్లో నివారణ టీకాలు వేశారు. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వాసు పావని, లైవ్ స్టాక్ అసిస్టెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

### సభ విజయవంతం చేయాలి

రాయికల్: ఈనెల 27న కేసీఆర్ తలపెట్టిన రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్‌యాదవ్ కోరారు. గురువారం కొత్తపేట, ఒడ్డెలింగాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మందుల శ్రీనివాస్, నర్సయ్య, రమేశ్, చింతలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, సురేశ్, నడిపి నర్సయ్య పాల్గొన్నారు.

### బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

జగిత్యాలటౌన్: బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో భారత్ సురక్షా సమితి నాయకులు సమావేశం నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ అట్టుడుకుతోందని, వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఒక సామాజికవర్గం వారు ఆందోళనలు నిర్వహిస్తున్నారని అన్నారు. పుప్పాల సత్యనారాయణ, చిట్ల గంగాధర్, సింగం గంగాధర్, వేముల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.